ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

మంచిర్యాల
జిల్లా వార్తలు

5

బుధవారం 21 ఆగస్టు 2024

రాజీవ్‌గాంధీ సేవలు వెలకట్టలేనివి 7లో..

పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి 7లో..

ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సంక్షేమ పథకాలు కొనసాగింపు



కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

మందమర్రిటౌన్, ఆగస్టు 20: రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలకు కాంగ్రెస్ ప్రభుత్వం నిధులను కేటాయిస్తుందని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. మంగళవారం సీఈఆర్ క్లబ్‌లో కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను 136 మంది లబ్ధిదారులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని, వడ్డీలు చెల్లించలేని పరిస్థితి నెల కొందని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. ప్రజలకు ఏమైనా సమస్యలుంటే తనకు తెలియజేయాలన్నారు. తహసీల్దార్ సతీష్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, నాయకులు ఉపేందర్‌గౌడ్, సొత్కు సుదర్శన్, బండి సదానందం, తిరుమల్‌రెడ్డి, ఆకారం రమేష్, గుడ్ల రమేష్ పాల్గొన్నారు.

-మున్సిపాలిటీ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు

పాలకవర్గం లేని మందమర్రి మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి తెలిపారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో రూ.40 లక్షలతో కొనుగోలు చేసిన ట్రాక్టర్‌లను ప్రారంభించి మాట్లాడారు. పట్టణంలో తాగునీటికి అంతరాయం లేకుండా అధికారులు చూడాలన్నారు. అనంతరం పలువురు సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి పత్రాలు అందించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

కాసిపేట, ఆగస్టు 20: గ్రామపంచాయతీ సాధారణ ఎన్నికల్లో భాగంగా అన్ని పంచాయతీల్లో ఓటరు జాబితాను సిద్ధం చేయాలని ఎంపీడీవో సత్యనారాయణసింగ్ అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీలోని ఓటరు జాబితాను సిద్ధం చేసి మెర్జింగ్ స్టేట్ మెంట్‌ను తయారు చేయాలని సూచించారు. టీపోల్ ఎంట్రీ చేయాలని, అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న 14 గ్రామపంచాయతీల్లో ఫారెస్టు రైట్స్ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అన్ని గ్రామపంచాయతీల్లో వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని, పారిశుధ్యపనుల్లో కార్యదర్శులు నిర్లక్ష్యం వహించరాదన్నారు. క్లోరినేషన్ చేసి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎంపీవో షేక్ సప్దర్ ఆలీ, ఏపీవో నవీన్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న డీఈవో యాదయ్య

జైపూర్, ఆగస్టు 20: విద్యార్థులు చదువుతోపాటు సృజనాత్మక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని డీఈవో యాదయ్య అన్నారు. మంగళవారం ఇందారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. డీఈవో మాట్లాడుతూ జీవితానికి అవసరమైన మెళకువలను చదువుతోపాటు నేర్చుకోవాలన్నారు. విద్యార్థులు అవ్వ తాతలకు రాసిన ఉత్తరాలను పరిశీలించి సూచనలు చేశారు. తెలుగుతోపాటు ఇంగ్లీష్, హిందీలో కూడా ఉత్తరాలు రాయాలన్నారు. ఇంటర్నెట్, సెల్‌ఫోన్ వినియోగం విస్తరించడంతో ఉత్తరాలు రాయడం తగ్గిపోయిందని, విద్యార్థులు ఉత్తరాలు రాయడం అభినందనీయమన్నారు. అనంతరం ఉత్తమ లేఖలు రాసిన పదో తరగతి విద్యార్థులు సంపత్‌కుమార్, శ్రీజ, అభినయశ్రీ, 8వ తరగతి విద్యార్థిని శ్రీవాణిలకు ప్రశంసాపత్రాలు అందించాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. ఉపాధ్యాయుల టీచింగ్ డైరీలను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు రమాదేవి, విజయలక్ష్మీ, సత్తిరెడ్డి, రమేష్, చక్రధర్, సంధ్యారాణి, మంజుల, రవీందర్, పద్మ, సత్యనారాయణ, కనకయ్య, సీఆర్‌పీ జనార్దన్ పాల్గొన్నారు.

లైంగిక వేధింపులపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న షీటీం ఎస్ఐ

లక్సెట్టిపేటరూరల్, ఆగస్టు 20: విద్యార్థినులు పాఠశాలలు, కళాశాలల్లో ఇంటి వద్ద బంధువులతో ఎదురయ్యే లైంగిక వేధింపుల పట్ల అప్రమత్తంగా ఉండాలని షీటీం ఎస్ఐ హైమా అన్నారు. మంగళవారం లక్సెట్టిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాల, కళాశాలలో షీటీం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాలు, ఆత్మహత్యలు, డ్రగ్స్ నివారణ, గుడ్ టచ్ బ్యాడ్‌టచ్, వరకట్న చట్టాలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ మహిళలు, పిల్లల రక్షణ, భద్రత, భరోసా సెంటర్‌లు పనిచేస్తాయని తెలిపారు. ఎవరైనా మహిళలు, బాలికలను వేధిస్తే షీటీం నెంబర్ 6303923700కు లేదా డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. భరోసా సెంటర్ కోఆర్డినేటర్ విజయ, వైస్‌ప్రిన్సిపాల్ మహేశ్వర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 20: భారత్‌బంద్‌ను బుధవారం విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ కోర్టు ఎస్సీ వర్గీకరణకు తీర్పునివ్వడం ఆవేదనకు గురిచేసిందన్నారు. సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా భారత్‌బంద్ నిర్వహిస్తున్నామన్నారు. సుధీర్, మధుకర్, పురుషోత్తం, శంకరయ్య, రాజేష్, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

- ప్రజల ప్రాణాలతో అంబులెన్స్ డ్రైవర్ల చెలగాటం
- తమకు నచ్చిన ఆసుపత్రులకే రోగుల తరలింపు
- సకాలంలో వైద్యం అందక గాల్లో కలుస్తున్న ప్రాణాలు
- ముఠాగా ఏర్పడి అందినకాడికి దండుకుంటున్న వైనం

కమీషన్ల కోసం కక్కుర్తి





కాలయాపనతో బ్రెయిన్ డెడ్

జైపూర్ మండలం షెట్‌పల్లికి చెందిన ఓ యువకుడు కొద్ది రోజుల కింద రోడ్డు ప్రమాదంలో గాయపడగా, కొందరు అంబులెన్స్ డ్రైవర్లు కమీషన్ల కోసం ఆస్పత్రుల చుట్టూ తిప్పి కాలయాపన చేయడంతో బ్రెయిన్ డెడ్ అయి మృతి చెందిన సంఘటన జిల్లాలో సంచలనం సృష్టించింది. గ్రామానికి చెందిన రేవెల్లి శ్రీకాంత్ (35) మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్లో ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు.

రోగిని తరలిస్తే రూ. 30 వేలు కమీషన్

అంబులెన్స్ డ్రైవర్లు, నిర్వాహకులు కమీషన్ల కోసం రోగులను తర లించే ఆనవాయితీ జిల్లాలో కొనసాగుతోంది. జిల్లా వ్యాప్తంగా 350 వరకు ప్రైవేటు అంబులెన్స్‌లు ఉండగా, ఒక్క జిల్లా కేంద్రంలోనే 110 ఉన్నాయి. వాటి ఓనర్లు, డ్రైవర్లు ప్రైవేటు ఆస్పత్రులతో సంబంధాలు ఏర్పాటు చేసుకొని కమీషన్ల దందా కొనసాగిస్తున్నారు. వైద్యులు రెఫర్ చేసిన చోటుకు కాకుండా రోగులను డ్రైవర్లు తమకు అను కూలంగా ఉండే ఆస్పత్రులకు తరలిస్తూ రూ.30 వేల చొప్పున కమీ షన్లు దండుకుంటున్నారనే ప్రచారం జరుగుతోంది. రోగుల కుటుంబ సభ్యుల ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా నేరుగా వారికి నచ్చిన ఆస్పత్రుల్లో జాయిన్ చేస్తూ అందినకాడికి దండుకుంటున్నారనే ప్రచారమూ ఉంది.

మంచిర్యాల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లాలో ప్రైవేటు అంబులెన్స్ నిర్వాహకులు, డ్రైవర్ల ఆగడాలు రోజురోజుకూ మితిమీరి పోతున్నాయి. రోగుల ప్రాణాలు పోయినా సరే...తమ జేబులు నింపుకోవడమే లక్ష్యంగా అందినకాడికి దండుకుంటున్నారు. జిల్లా కేంద్రంలో ఐదారుగురు ముఠాగా ఏర్పడి శవాల మీద పైసలేరుకునే స్థితికి చేరుకున్నారు. రోగి దొరికితే చాలు రక్తం పీల్చే జలగల్లా నిలువు దోపిడీకి పాల్పడుతున్నారు. డాక్టర్ల సూచనలను పక్కనబెట్టి కరీంనగర్, హైద్రాబాద్ లాంటి దూర ప్రాంతాల్లోని తమకు తెలిసిన ఆస్పత్రులకు రోగులను తరలిస్తున్నారు. ట్రీట్‌మెంట్ మంచిగా ఉంటుందని నమ్మబలుకుతూ ఆస్పత్రుల వెంట తిప్పుతూ చివరికి ప్రాణాలు పోగొడుతున్నారు. అరగంట ముందుగా వచ్చి ఉంటే బతికేవాడన్న వైద్యుల మాటలు డ్రైవర్ల ఆగడాలకు అద్ధం పడుతున్నాయి.

ఈ నెల 6న డ్యూటీ ముగించుకుని ఇంటికి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో మం చిర్యాలలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించగా వైద్యులు కరీంనగర్ లోని భద్రకాళికి ఆస్పత్రికి రెఫర్ చేశారు.

అంబులెన్స్‌లో వెళ్తుండగా మార్గమధ్యలో ఐదుగురు డ్రైవర్లు అంబులెన్స్‌లో ఎక్కి పరిస్థితి సీరియస్‌గా ఉందని, అవయవ దానం చేస్తే ఉపయోగకరంగా ఉంటుందంటూ కుటుంబ సభ్యులను ఒప్పించే ప్రయత్నం చేస్తూ కరీంనగర్‌లోని కెల్విన్ ఆస్పత్రికి తరలించేలా పట్టుబట్టారు. అక్కడ స్కానింగ్ లేక పోవడంతో మరో చోటుకు తరలిం చారు. దీంతో సమయాభావంతో శ్రీకాంత్ సీరియస్ పొజిషన్‌కు వెళ్లాడు. ఆస్పత్రి వైద్యులు హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్‌కు రెఫర్ చేశారు. యశోద హాస్పిటల్లో ట్రీట్మెంట్‌కు ఎక్కువ ఖర్చవుతుందని, కామినేని హాస్పిటల్లో త కక్కువ ఖర్చుతో చేయిస్తామని చెప్పి అక్కడికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు రెండు రోజుల అనంతరం శ్రీకాంత్‌కు బ్రెయిన్ డెడ్ అయి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. దీంతో అక్కడే అవయవదానం చేశారు. మంచిర్యాల వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌లోని భద్రకాళి ఆస్పత్రికి తరలించి ఉంటే సకాలంలో చికిత్స అంది, బతికేవాడన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కేవలం కమీషన్ కోసం కరీంనగర్‌లో ఆస్పత్రుల చుట్టూ తిప్పడమేగాక హైద్రాబాద్ వరకు తరలించడంతో శ్రీకాంత్ కుటుంబ సభ్యులకు తీరని నష్టం వాటిల్లింది. ప్రైవేట్ హాస్పిటల్స్ ఇచ్చే కమీషన్లకు ఆశపడి రోగుల చావుకు కారణమైన పలు సంఘటనలు జిల్లా కేంద్రంలో ఉన్నాయి.

కటకటాల్లో డ్రైవర్ల ముఠా...

శ్రీకాంత్ కుటుంబ సభ్యులను ఏమార్చిన అంబులెన్స్ డ్రైవర్ల ముఠాను రెండు రోజుల క్రితం పోలీసులు అరెస్టు చేశారు. ముఠా సభ్యులైన కిరణ్, నరేష్, శ్రావణ్ అలియాస్ నాని, సాయి, సాగర్‌లను మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు అరెస్టు చేశారు. వీరు గత కొంత కాలంగా ముఠాగా ఏర్పడి కార్పొరేట్ ఆస్పత్రులతో సంబంధాలు ఏర్పరుచుకొని రోగులను తరలిస్తూ కమీషన్ల దందా కొనసాగిస్తున్నారు. అవయవ దానం ప్రధాన వృత్తిగా పెట్టుకున్న వీరు కరీంనగర్, హైద్రాబాద్ లాంటి ప్రాంతాల్లోని కార్పొరేట్ ఆస్పత్రులకు మృతదేహాలను అప్పగించి కమీషన్ల రూపంలో లక్షలు దండుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో బాడీపై కనీసం రూ. 8 లక్షల వరకు వసూలు చేస్తారనే ప్రచారం జరుగు తోంది. అలా వసూలు చేసిన కమీషన్‌లో బాధిత కుటుంబానికి (వారు అంగీకరించిన పక్షంలో) కొంత ముట్టజెప్పుతూ మిగతాది జేబులో వేసుకుంటారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పై ముఠా సభ్యుల్లో ఒక్కొక్కరికి మూడు, నాలుగు అంబులెన్సులు ఉండటం గమనార్హం.

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి



భీమారం పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న కలెక్టర్, మొక్కకు నీరు పోస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

భీమారం, ఆగస్టు 20: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల పరిసరాలను, విద్యార్థుల, ఉపాధ్యాయుల రిజిష్టర్‌లను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు గణితం, తదితర సబ్జెక్టుల్లో మెరుగైన ఫలితాలు వచ్చేలా చదవాలని, ఇందుకు ఉపాధ్యాయులు విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. పదో తరగతిలో గణితం సబ్జెక్టులోని త్రికోణమితి చాప్టర్ నుంచి విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు విక్రమ్, ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ఉపాధ్యాయులు సీఎల్ పెడితే నియోజకవర్గ సీఎల్ గ్రూపులో వెంటనే పోస్టు చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. పాఠశాలకు సరిగ్గా హాజరు కాని విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉండాలని, అవసరం అయితే మల్టీపర్పస్ వర్కర్ల ద్వారా పనులను చేయించాలని ప్రధానోపాధ్యాయునికి సూచించారు. పాఠశాలకు మంజూరైన వివిధ పనుల పురోగతి గురించి కలెక్టర్ తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భావితరాల ఆరోగ్యానికి మొక్కల సంరక్షణ

మంచిర్యాల కలెక్టరేట్: భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని రూపొందించడంలో మొక్కలు ప్రధాన పాత్ర పోషిస్తాయని, ప్రతీ ఒక్కరు తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. భారత జాతీయ రహదారుల సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన మియావాకి, మాసివ్ ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా శ్రీరాంపూర్ ఏరియాలో నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మొక్కలు నాటి నీరు పోశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 1 నుంచి 20 వరకు ఎన్‌హెచ్ 363 రహదారికి ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిచామన్నారు. ఎన్‌హెచ్ అధికారులు అజయ్ మణి, సతీష్, సంతోష్, సునీల్, వెంకటేశ్వర్లు, రంజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ పొందడం అభినందనీయం

జిల్లా వయోజన విద్యాశాఖ పరిధిలోని డీఆర్‌పీ రెడ్డిమల్ల ప్రకాశం సమాజ సేవలో డాక్టరేట్ పొందడం అభినందనీయమని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రకాశం అందించిన సేవలకు మాజిక్ బుక్ ఆఫ్ రికార్డు సంస్థ ద్వారా ఢిల్లీలో డాక్టరేట్ పొందిన ప్రకాశంను మంగళవారం కలెక్టరేట్‌లో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తంనాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, రవీందర్‌రెడ్డి, రాజ్ వీరు, తిరుపతి, శాంకరి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భారీ వర్షాల సమయంలో అప్రమత్తంగా ఉండాలి

భారీ వర్షాల సమయంలో ప్రజలకు ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు రక్షణ చర్యలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఖమ్మం నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా, హైద్రాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలితో కలిసి కలెక్టర్, అధికారులతో సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంతాలను గుర్తించి ప్రజా రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో పారిశుధ్య పనులను చేపట్టాలన్నారు. ఎస్ఆర్ఎస్ దరఖాస్తులను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం క్రమబద్ధీక రించాలని తెలిపారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ వర్షాలతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు రక్షణ చర్యలు తీసుకుంటున్నామని, శిథిలవస్థలో ఉన్న ప్రభుత్వ భవనాలు, నివాస గృహాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. అదనపు కలెక్టర్ మోతి లాల్, జెడ్పీ సీఈవో గణపతి పాల్గొన్నారు.

ఆధార్ నమోదు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ఆధార్‌కార్డు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

దండేపల్లి, ఆగస్టు 20: దండేపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన శాశ్వత ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సంధ్యరాణి కోరారు. మంగళవారం శాశ్వత ఆధార్ నమోదు కేంద్రాన్ని ఆమె పునఃప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ కొత్త ఆధార్‌కార్డు నమోదుతోపాటు చేర్పులు, మార్పులు చేసుకోవచ్చున్నారు. పేరు, చిరునామా, పుట్టిన తేది, జెండర్, మొబైల్ ఫోన్ నెంబర్, ఈ-మెయిల్ ఐడి తదితర వివరాలను మార్చుకోవచ్చన్నారు. బయోమెట్రిక్స్ సంబంధించిన ఫొటో, వేలిముద్రలు అప్‌డెట్ చేసుకోవచ్చున్నారు. నాయబ్ తహసీల్దార్ విజయ, ఆధార్ నిర్వాహకురాలు అర్చన ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 20 : పట్టణంలోని ఏసీసీ ఏరియాలో గల 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ (12.5ఎంవీఏ) పునరుద్ధరణ చేస్తున్నందున ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కల్గుతుందని ఏడీఈ వేణుగోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలోని మార్కెట్ ఏరియా, జన్మభూమి నగర్, జాఫర్‌నగర్, గౌతమీనగర్, ఇందిరానగర్, ఇస్లాంపురా, హైటెక్‌సిటి, సుభాష్‌రోడ్, ఎంసీసీ ఏరియా, ఆండాలమ్మ కాలనీ, గ్రీన్‌సిటి, లక్ష్మీనగర్, వికాస్‌నగర్, మారుతినగర్, రాళ్లపేట ప్రాంతాలకు అంతరాయం కల్గుతుందని తెలిపారు.

దివ్యాంగ విద్యార్థుల నిర్ధారణ శిబిరం

ఏసీసీ, ఆగస్టు 20: తెలంగాణ సమగ్ర శిక్ష, భారత కృత్రిమ అవయవాల నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులకు సహాయ ఉపకరణాలు అందించేందుకు ఈనెల 22న జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర పాఠశాలలో నిర్ధారణ శిబిరం నిర్వహిస్తున్నట్లు డీఈవో యాదయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 ఏండ్లలోపు వయస్సు కలిగిన దివ్యాంగ విద్యార్థులు వినికిడి యంత్రాలు, వీల్‌చైర్, మూడు చక్రాల సైకిల్, స్కూల్, కృత్రిమ అవయవాలు, స్మార్ట్‌ఫోన్‌లు పొందడానికి శిబిరానికి హాజరు కావాలని కోరారు. ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్, రేషన్‌కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం జిరాక్స్‌లు, రెండు ఫొటోలు తీసుకురావాల న్నారు. వివరాలకు 8328363596లో సంప్రదించాలన్నారు.

డ్రైనేజీ పూడిక తీత

చెన్నూరు, ఆగస్టు 20: పట్టణంలోని 10వ వార్డులో డ్రైనేజీ సరిగ్గా లేకపోవడంతో రోడ్డుపై నుంచి మురుగు నీరు పారి దుర్గంధం వస్తుండడంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి దృష్టికి తీసుకువెళ్లడంతో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి మంగళవారం ఎక్స్‌కావేటర్‌తో గడిరావి చెట్టు నుంచి చోట హనుమాన్ ఆలయం వరకు పూడిక తీత తీయించారు.

రుణమాఫీ కోసం రోడ్డెక్కిన రైతులు



జన్నారంలోని ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

జన్నారం, ఆగస్టు 20: ప్రతీ రైతుకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని కవ్వాల, దేవునిగూడ, కామన్ పల్లి, బంగారు తండా, హాస్టల్ తండాలకు చెందిన రైతులు మంగళవారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సం దర్భంగా రైతులు మాట్లాడుతూ రూ.2 లక్షల రుణం ఉన్న ప్రతీ రైతుకు రుణమాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం కొంత మందికే చేశారని, బ్యాంకు అకౌంట్లలో చిన్న తప్పులు ఉన్నా రుణమాఫీ వర్తింపజేయకపోవడం సరికాదన్నారు. రూ. 2 లక్షల పైన రుణం ఉన్న వారికి కూడా రూ.2 లక్షలు రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

కోటపల్లి: కోటపల్లి రైతువేదిక వద్ద మంగళవారం రూ.2 లక్షల రుణ మాఫీ కాలేదని రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. వెంటనే ప్రభుత్వం అర్హులైన వారందరికి రుణమాఫీ చేయా లని డిమాండ్ చేశారు. కోటపల్లి, శెట్‌పల్లి, పంగిడి సోమారం, పిన్నారం గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.



కోటపల్లి రైతు వేదిక వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

జిల్లాకు సీసీఎఫ్ రాక



సీసీఎఫ్‌కు స్వాగతం పలుకుతున్న సీఎఫ్

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 20 : కాళేశ్వరం జోన్-2 చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు (సీసీఎఫ్) బిట్ల ప్రభాకర్ జిల్లా అటవీ శాఖ కార్యాలయానికి మంగళవారం వచ్చారు. సీసీఎఫ్ హోదాలో మొదటిసారిగా కార్యాలయానికి వచ్చిన అయనకు మంచిర్యాల సీఎఫ్ శాంతారాం మొక్కను అందజేసి స్వాగతం పలికారు. జిల్లాలోని అటవీశాఖలో విధులు నిర్వహిస్తున్న నలుగురు జూనియర్ అసిస్టెంట్లు సెక్షన్ ఆఫీసర్లుగా కన్వర్షన్ అయ్యేందుకు జరిగే పరీక్షలను పర్యవేక్షించేందుకు ఆయన జిల్లాకు వచ్చినట్లు సమాచారం.

● రాఖీ పండుగ ఎఫెక్ట్

ఆర్టీసీకి గణనీయంగా పెరిగిన ఆదాయం



మంచిర్యాల బస్టాండ్‌లో రద్దీ

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 20 : రాఖీ పండగ ఆర్టీసీలో కాసుల వర్షం కురిపించింది. 46 లక్షల 20వేల965 రూపాయల ఆదాయం సమకూరినట్లు ఆర్టీసీ డీఎం పేర్కొన్నారు. 86,761 మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేసినట్లు తెలిపారు. ఇందులో 57 వేల మంది మహిళలు, ఇతరులు 30 వేల మంది ఉన్నారు. ఆర్టీసీ మహాలక్ష్మీ స్కీంను మినహాయించగా రూ.22,75,040 ఆదాయం సమకూరింది. 66 శాతం మంది మహిళలు ప్రయాణించారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆర్టీసీ యాజమాన్యం సూచన మేరకు డ్రైవర్లు, కండక్టర్లకు లంచ్ బాక్స్, మంచినీటిని అధికారులు పంపిణీ చేశారు. వారం రోజులుగా ఆర్టీసీ మంచిర్యాల డిపో బస్సుల ఆదాయం రూ.34 నుంచి 36 లక్షల ఆదాయం ఉంది. మొత్తంగా రాఖీ పండగ మంచిర్యాల ఆర్టీసీకి కాసుల వర్షం కురిపించింది. డిపో పరిధిలో 145 బస్సులు రవాణాకు వినియోగిస్తున్నామని ఇందులో 69 ప్రైవేటువి ఉన్నాయని డీఎం తెలిపారు.

-కార్గో ద్వారా ఆదాయం పెంపు

డిపో ద్వారా కార్గోకు వారం రోజులుగా రూ.35 నుంచి 40 వేల ఆదాయం ఉండగా రాఖీ పండగ రోజున 300ల పార్శిళ్లను రవాణా చేశారు. ఆదాయం రూ.55,510 సమకూరినట్లు మంచిర్యాల డిపో మేనేజర్ జనార్దన్ తెలిపారు.

మహిళా కార్మికులను వేధించేవారికి శిక్ష తప్పదు

-మావోయిస్టు కార్యదర్శి ప్రభాత్

మంచిర్యాల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ఆర్జీ-1 ఇంక్లైన్లో పనిచేస్తున్న మహిళ కార్మికురాలు స్వపపై ఏఐటీయూసీ నాయకుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు భారత కమ్యూనిస్టు పార్టీ (మావో యిస్టు) సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఏఐటీయూసీ నాయకుడు మడ్డి ఎల్లయ్య, సింగరేణిలో పనిచేస్తున్న అతని కొడుకు మరికొందరు సంఘ నాయకులు మహిళా కార్మికుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తు న్నారని, వారిపై దుష్ప్రచారాలను కొనసాగిస్తూ, వేధింపులకు పాల్పడుతు న్నారని పేర్కొన్నారు. ఐఎన్టీయూసీ దళిత మహిళ నాయకురాలుగా కార్మిక సమస్యలపై స్పందించే స్వప్న సంఘానికి చెందిన అవకాశవాద బ్రాహ్మణీయ ఫాసిస్టు నాయకుల కుట్రలకు బలికావలసిన పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. సింగరేణిలో మహిళా కార్మికులను సాటి కార్మి కులుగా చూడలేని అధికారులు, యూనియన్ నాయకులు అడుగడుగున అవమానాలకు గురి చేస్తున్నారని విమర్శించారు. మహిళా కార్మికులు పై అధికారులకు ఫిర్యాదు చేసినా న్యాయం చేయడం మాని వేధింపులు, అవమానాలకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులు, ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, మహిళా సంఘాలు సింగరేణిలో మహిళా కార్మికులకు అండగా నిలబడాలని, ఆ వర్గాలపై వేధింపులకు పాల్పడే వారిని ఎండగడుతూ న్యాయపోరాటాలు చేయాలని పిలుపుని చ్చారు. రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ఈ విషయమై స్పందిం చకపోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. మహిళా కార్మికులను వేధించే వారికి వత్తాసు పలికే అధికారులు, ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ, టీబీజీకే ఎస్ నాయకులు తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. స్వప్నపై దాడికి పాల్పడ్డ వారిపై అట్రాసిటీ కేసుతోపాటు హత్యాయత్నం, మహిళా వేధింపుల కేసులను నమోదు చేయాలని, పోలీసులు పక్షపాతంగా వ్యవహరించడం మానుకోవాలని డిమాండ్ చేశారు.

లింగ వివక్షతను విడనాడాలి

శ్రీరాంపూర్, ఆగస్టు 20 : సమాజం లింగ వివక్షతను విడనాడాలని జిల్లా మహిళా సాధికారిత కేంద్రం జెండర్ స్పెషలిస్టు విజయ, ఆర్థిక అక్షరాస్యత నిపుణురాలు లిప్సిక అన్నారు. బేటీ పడావో బేటీ బచావో పథకం, బాలిక రక్షణపై మంగళవారం ఎయిమ్స్ పాఠశాలలో అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ, గర్భస్థ శిశువు, లింగ నిర్ధారణ చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం, ఆన్‌లైన్ సేఫ్టీ, సైబర్ క్రైమ్, మహిళా హెల్ప్‌లైన్, సఖి కేంద్రం తదితర విషయాలపై అవగాహన కలిగి ఉం డాలని సూచించారు. ప్రిన్సిపాల్ మైదం రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బేకరి యజమానికి జరిమానా

నస్పూర్, ఆగస్టు 20: నస్పూర్ కాలనీలోని బెంగళూర్ బేకరిని మంగళ వారం మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్ తనిఖీ చేశారు. బేకరిలో శుభ్రత పాటించకుండా తినుబండారాలను తయారు చేస్తున్నారని, వంట గదిలో చిమ్నీ లేకపోవడంతో చుట్టుపక్కల ఇండ్లలోకి పొగ వస్తుందని కమిషనర్ తెలిపారు. నిబంధనలు పాటించని బేకరి యాజమానికి రూ.పది వేల జరిమానా వేశారు. ప్లాస్టిక్ వినియోగించవద్దని, వంట గదులను శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆహార పదార్థాలు, మాంసం తాజాగా ఉండే విధంగా చూడాలన్నారు. 10వ వార్డులో మంగళ వారం డ్రైడే సందర్భంగా పలు ఇండ్ల సమీపంలో ప్లాస్టిక్ డబ్బాలు, కొబ్బరి బొండాలు, కూలర్స్, టైర్స్, పాత ప్లాస్టిక్ సామానుల్లో నిల్వ నీటిని పారబోసారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలు

బెల్లంపల్లి(తాండూర్), ఆగస్టు 20: ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం జనహక్కుల పోరాట సమితి మోకుదెబ్బ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలను నిర్వహించారు. మోకుదెబ్బ రాష్ట్ర అధికార ప్రతినిధి భూసారపు మొండిగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమల్ల భాస్కర్‌గౌడ్, రాష్ట్ర నాయకుడు శంకర్‌గౌడ్‌లు పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్, సీఐ కుమారస్వామి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎండీ ఈసా, జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్, గట్టు మురళీధర్‌రావు, బాలయ్య, పాల్గొన్నారు.

యోగా గురువు అయ్యంగార్ జీవితం స్ఫూర్తిదాయకం

మందమర్రిరూరల్, ఆగస్టు 20: యోగా గురువు బెల్లూర్ కృష్ణమాచార్ సుందర రాజ అయ్యంగార్ జీవితం నేటి సమాజానికి స్ఫూర్తిదాయకమని యోగా శిక్షకులు కొంపెల్లి రమేష్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం అయ్యంగార్ వర్ధంతి సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగానికి ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి అయ్యంగార్ అని పేర్కొన్నారు. అయ్యంగార్ యోగా అనే సంస్థను స్థాపించి ప్రపంచానికి యోగాను పరిచయం చేసిన గొప్ప మహానుభావుడు అయ్యంగార్ అని పేర్కొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

సిర్పూర్(టి), ఆగస్టు 20: సూర్యాపేట ఆసుపత్రిలో ఔట్‌సోర్సింగ్‌లో విధులు నిర్వహిస్తూ ఐదు నెలల వేతనాలు రాక ఆత్మహత్య చేసుకున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగి వసీం కుటుంబానికి చేయూతనివ్వాలని వైద్య సిబ్బంది డిమాండ్ చేశారు. మంగళవారం సిర్పూర్(టి) మండల కేంద్రంలోని ఆసుపత్రి ఆవరణలో వైద్య సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. వసీం కుటుంబాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

చెత్తాచెదారం ఎప్పటికప్పుడు తొలగించాలి

దహెగాం, ఆగస్టు 20: చెత్తాచెదారం ఎప్పటికప్పుడు తొలగించాలని ఇన్‌చార్జి డీఎల్‌పీవో హుమర్‌హుస్సేన్ అన్నారు. దహెగాం మండలం నుంచి లగ్గాం, కల్వాడ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా నీరు నిలువ ఉన్న ప్రదేశాలను మంగళవారం పరిశీలించారు. నీరునిలువ ఉండకుండాచర్యలు చేపట్టాలని కార్యదర్శిని ఆదేశించారు. డ్రైనేజీపై నిర్మించిన రేకుల షెడ్, రహదారులపై గేదెలు తిష్ట వేయకుండా వీల్స్‌ట్రాక్టర్‌లు గ్రామంలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆయన వెంట కార్యదర్శి ప్రణీత్‌బాబు ఉన్నారు.

గణేశ్ ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించుకోవాలి

సిర్పూర్(టి), ఆగస్టు 20: మండల కేంద్రంలో వచ్చే నెల 4 నుంచి నిర్వహించే గణేశ్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఎస్సై కమలాకర్ అన్నారు. పోలీసు స్టేషన్ ఆవరణలో మంగళ వారం ఏర్పాటు చేసిన పీస్‌కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గణేశ్ మండలీల నిర్వాహకులు మండపాల వద్ద నిబంధనలు పాటించాలని చెప్పారు. విద్యుత్ సౌకర్యం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. మండపాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ హనుమంతు, మాజీ ఎంపీటీసీ సోహెల్ అహ్మద్, శంకర్, మహేష్, విక్రం, ప్రశాంత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలు లేరని మనస్తాపం

ఒకరోజు వ్యవధిలో దంపతుల ఆత్మహత్య


గురువయ్య- వెంకటమ్మ (ఫైల్)

బెల్లంపల్లి, ఆగస్టు 20: ఆ దంపతులకు ఇరవై సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వారికి పిల్లలు పుట్టకపోవడంతో మనస్తాపానికి గురయ్యారు. పిల్లలు లేరనే బాధతో 24 గంటల వ్యవధిలో దంపతులు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బెల్లంపల్లి మండలం కాశిరెడ్డిపల్లిలో చోటుచేసుకుంది. కాశిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పత్రి గురువయ్య (40), వెంకటమ్మ(35) దంపతులకు సంతానం కలగలేదు. గురువయ్య కూలీ చేసుకుని జీవించేవాడు. పిల్లలు కలుగడం లేదనే విషయంపై భార్యతో అప్పుడప్పుడు గొడవపడుతుండేవాడు. ఈ క్రమంలో ఈ నెల 18న దంప తుల మధ్య గొడవ జరిగింది. గురువయ్య భార్యను కొట్టడంతో గాయాలపాలైంది. కుటుంబ సభ్యులు వెంకటమ్మను బెల్లంపల్లి ఆసుపత్రిలో చేర్పించారు. ఎందుకు కొట్టావని ప్రశ్నించడంతో క్షణికావేశంలో గురువయ్య పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పిల్లలు లేరనే మన స్తాపం, భర్త మృతితో వెంకటమ్మ సోమవారం రాత్రి ఇంటి ఆవరణలో ఉన్న చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తాళ్లగురిజాల ఎస్ఐ రమేష్ తెలిపారు.

వరిలో చీడపీడలపై అవగాహన సదస్సు

కాసిపేట, ఆగస్టు 20: వరిలో ఆశించే చీడపీడల నివారణపై ముత్యంపల్లి రైతువేదికలో మంగళవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి చల్ల ప్రభాకర్ మాట్లాడుతూ వరిని ఆశించే చీడపీడలపై రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను శాస్త్రవేత్తల ద్వారా ముఖాముఖి చర్చ నిర్వహించామన్నారు. పంట రుణమాఫీపై ఫిర్యాదులు, సందేహాలను నివృత్తి చేశామన్నారు. రైతులకు ఏమైనా అనుమానాలుంటే మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఏఈఓ దీప్తి, రైతులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు సన్మానం

జన్నారం, ఆగస్టు 20: పంచాయతీ కార్యదర్శులను మంగళవారం జన్నారంలో ఎస్‌సీటీ సంస్థ చైర్మన్, టీఎన్‌ఎంవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సాయిని ప్రసాద్ నేత సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ కార్యదర్శులు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మధు, కోశాధికారి విశ్వశ్రీ, రమేష్, నాయకులు నర్సగౌడ్, వెంకటేష్, వినోద్, వినోద్‌కుమార్, రుబెన్, వికాస్, సురేష్ పాల్గొన్నారు.

బీసీ ఉద్యమాన్ని గ్రామస్థాయికి తీసుకువెళ్లాలి

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 20: బీసీ ఉద్యమాన్ని రాజకీయ పార్టీలకు అతీతంగా గ్రామస్థాయికి తీసుకుపోవాలని బీసీ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం బీసీ భవన్‌లో నిర్వహించిన కార్యాచరణ కమిటీ సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ పేరిట బీసీలకు 42 శాతం కేటాయించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత దాటవేసే ధోరణి అవలంబిస్తుందన్నారు. హక్కుల సాధన కోసం కార్యాచరణను సిద్ధం చేశామని, కలెక్టరేట్ ఎదుట దీక్ష, ఎమ్మెల్యేలు, ఎంపీలకు వినతిపత్రాలు ఇవ్వాలని తీర్మానించామన్నారు. వడ్డెపల్లి మనోహర్, శ్రీనివాస్, నరెడ్ల శ్రీనివాస్, కర్రె లచ్చన్న, పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన హోంగార్డుకు వీడ్కోలు

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 20 : కమిషనరేట్ పరిధిలో 38 యేండ్ల పాటు హోంగార్డుగా పనిచేసి పదవీ విరమణ పొందిన బెల్లంపల్లి సబ్ యూనిట్ హోంగార్డు ఎండి.జమీల్‌ను మంగళవారం సీపీ ఎం.శ్రీనివాస్ సన్మానించి వీడ్కోలు పలికారు. అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, ఏఆర్ ఏసీపీ సురేంద్ర, హోంగార్డ్స్ ఇన్‌చార్జి ఏఆర్ ఎస్సై బీరమ్ సింగ్ పాల్గొన్నారు.

కార్మికుల విధుల బహిష్కరణ

మందమర్రిటౌన్, ఆగస్టు 20: కేకే ఓసీపీలో పనిచేస్తున్న కాంట్రాక్టు డ్రైవర్లు, కార్మికులు వేతనాల కోసం మంగళవారం విధులు బహిష్కరించారు. కొన్ని రోజులుగా వేతనాలు చెల్లించడం ఆలస్యం చేస్తున్నారని దీంతో తమ కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయన్నారు.

రాజీవ్‌గాంధీ సేవలు వెలకట్టలేనివి


నస్పూర్‌లో కేక్ కట్ చేస్తున్న నాయకులు, బెల్లంపల్లిలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

బెల్లంపల్లి, ఆగస్టు 20: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. టౌన్ ప్రెసిడెంట్ ముచ్చర్ల మల్లయ్య రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజీవ్‌గాంధీ చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, కౌన్సిలర్‌లు నెల్లి శ్రీలతరమేష్, బండి ప్రభాకర్, సురేష్, అశోక్‌గౌడ్, రాములునాయక్, పాల్గొన్నారు.

నస్పూర్: మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ జయంతిని పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీసీసీ కార్నర్ వద్ద నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. ప్రధానిగా రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. సుర్మిళ్ల వేణు, సుధాకర్, దర్ని మధు, కౌన్సిలర్లు, పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: రాజీవ్‌గాంధీ జయంతిని నాయకులు ఘనగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీపీసీసీ కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పల్లె రాజులు మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలను కొనియాడారు.

లక్సెట్టిపేటరూరల్: పట్టణంలో రాజీవ్‌గాంధీ 80వ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణాధ్యక్షుడు ఎండీ ఆరీఫ్, మండల అధ్యక్షుడు పింగళి రమేష్, డీసీసీ అధికార ప్రతినిధి బియ్యాల తిరుపతి, కౌన్సిలర్ వెంకటేష్, శ్రీనివాస్, సుమన్, వెంకటేష్, షహిద్, స్వామి, శ్రీధర్,అమీర్, చంద్రమౌళి, రమేష్, నర్సింహాచారి, నర్సయ్య, పాల్గొన్నారు.

భీమారం: మండల కేంద్రంలో రాజీవ్‌గాంధీ జయంతి నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మందమర్రి టౌన్: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. నాయకులు నోముల ఉపేందర్ గౌడ్, సొత్కు సుదర్శన్‌లు మాట్లాడుతూ దేశంలో సాంకేతిక విప్ల వం తీసుకువచ్చింది రాజీవ్‌గాంధీ అన్నారు. నాయ కులు పుల్లూరి లక్ష్మణ్, నెర్వెట్ల శ్రీనివాస్, ఎండి ఆసిఫ్, ఇస్మాక్, జమీల్, శంకర్, పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి మహంత్ అర్జున్ కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు.వేణుగోపాల్, సజ్జు, సాయి, శ్రీను, ప్రకాష్, మోహన్ పాల్గొన్నారు.

ఏసీసీ: రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు నివాసంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణాధ్యక్షుడు తూముల నరేష్, బ్లాక్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, చిట్ల సత్యనారాయణ, వైస్‌చైర్మన్ సల్ల మహేష్, హేమలత, పెంట రజిత, అర్కల హేమలత పాల్గొన్నారు.

వేమనపల్లి: మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ జయంతిని నీల్వాయి గ్రామంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సాబీర్ అలీ, మాజీ సర్పంచులు గాలి మధు, తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పూర్ణచంద్రరెడ్డి పాల్గొన్నారు.

సమస్యలపై నేరుగా సంప్రదించాలి


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి, ఆగస్టు 20: పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని పలువురు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను సంబం ధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎటువంటి సమస్యలున్నా నేరుగా తనను కావాలని సూచించారు. నియోజ కవర్గ అభివృద్ధికి ఎల్లవేళలా ముందుంటానని పేర్కొన్నారు. అనంతరం దాసరి ప్రతాప్ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. నాయకులు బండి ప్రభాకర్, గెల్లి రాజలింగు పాల్గొన్నారు.

గుంతలమయమైన రహదారులు

మందమర్రి టౌన్, ఆగస్టు 20: పట్టణంలో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు గుంతలమయం అయ్యాయని, వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పెద్దపల్లి పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు సంజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ మందమర్రిలో ఎక్కడ చూసినా రోడ్లన్ని గుంతలమయం అయ్యాయని, రాత్రిపూట ప్రయాణికులు అందులో పడి ప్రమాదాలకు గురయ్యే అవకాశాలున్నాయి. విద్యుత్ దీపాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలతో 6వ వార్డులో నీరు చేరిందని, వరద నీరు నిలిచిపోవడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. వాసాల సంపత్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

లక్సెట్టిపేటరూరల్, ఆగస్టు 20 : ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మెరుగైన సౌకర్యాలు కల్పించాలని రఘునాథ్ వెరబెల్లి ఫౌండేషన్ ట్రస్టు చైర్మన్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌రావు అన్నారు. మంగళవారం ట్రస్టు ఆధ్వర్యంలో లక్ష్మీపూర్, జెండా వెంకటాపూర్, దౌడేపల్లి, వెంకట్రావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోటు బుక్స్, జామెట్రీ బాక్స్‌లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశ్యంతో విద్యార్థులకు తమ వంతుగా సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకోవాలని, ఒక లక్ష్యాన్ని ఎంచుకుని చదువులో ముందుకు సాగాలని పేర్కొన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు బొప్పు కిషన్, నాయకులు నాగిరెడ్డి, హేమంత్‌రెడ్డి, తోట సతీష్, మధుకర్, పెట్టం శ్రీరామ్, వేణుగోపాల్, పద్మ, వంశీ, లక్ష్మణ్ పాల్గొన్నారు.


స్కూల్ బ్యాగులు అందజేస్తున్న రఘునాథ్‌రావు

పెద్ద ధర్మారంలో తాగునీటికి కటకట


చేతి పంపు వద్ద గుమిగూడిన మహిళలు

కాసిపేట, ఆగస్టు 20: కాలమేదైనా తాగునీటికి పెద్ద ధర్మారం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై గతంలో అధికారులకు విన్నవించినప్పటికీ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్ద ధర్మారంలో మూడు చేతి పంపులు ఉండగా రెండు చెడిపోయాయి. అధికారులకు చెప్పినా ఎవరు పట్టించుకోవడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. పెద్ద ధర్మారంలో 40 కుటుంబాలు ఉండగా ఒకే ఒక్క చేతి పంపు పని చేస్తుంది. ఉదయం నుంచి మహిళలు చేతి పంపు వద్దనే క్యూలో ఉండాల్సి వస్తోంది. సొంత ఖర్చులతో చేతి పంపులకు మరమ్మతులు చేయించుకోవాలని అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉందని పేర్కొంటున్నారు. చేతి పంపులకు మరమ్మతు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

బదిలీపై వెళ్లిన ప్రిన్సిపాల్‌కు సన్మానం

జన్నారం, ఆగస్టు 20: జన్నారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శరత్‌కుమార్ బదిలీపై వేములవాడకు వెళ్తుండగా మంగళవారం కళాశాలలో నూతన ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు ఘనంగా శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

శానిటరి ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 20: మంచిర్యాల మున్సిపల్ శానిటరి ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఉదయ్ కిరణ్‌ను మంగళవారం రాముని చెరువు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. వాకింగ్ ట్రాక్ అభివృద్ధికి, వాకర్స్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విన్నవించారు. గజెల్లి వెంకటయ్య, జ్ఞాని, రామిరెడ్డి, ఎన్.నర్సయ్య, పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు

దండేపల్లి, ఆగస్టు 20: నాగసముద్రం గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు మహిళ మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు సందుర్గ సుగుణ, జిల్లా నాయకులు గుండం రాజలింగం ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. పూదరి రమణయ్య, బోంగుని శ్రీనివాస్, రవి, మల్లేష్, వెంకటేష్, రవి, భానుప్రసాద్, రవీందర్, నరేష్‌అజయ్‌తో పాటు 50 మంది నాయకులు, కార్యకర్తలు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ సమక్ష్యంలో చేరారు. పార్టీ మండల అధ్యక్ష కార్యదర్శు గోపతి రాజయ్య, ఎంబడి సురేందర్, సిపిరిశెట్టి శ్రీనివాస్, సందెల రవిగౌడ్, రాపల సంతోష్ పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థికసాయం

దండేపల్లి,ఆగస్టు 20: గుడిరేవు గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచు సంతపురి జనార్దన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. వారిది నిరుపేద కుటుంబం కావడంతో ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు చిట్ల రమణ మంగళవారం రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. శేఖర్, రాజన్న, సుధాకర్, కిరణ్, రమేష్, రాకేష్, శ్రీనివాస్ గంగన్నలు పాల్గొన్నారు.

రుణమాఫీ విషయంలో స్పష్టత కరువు

- ఆర్డీవో కార్యాలయం ఎదుట బీఆర్‌ఎస్ నాయకుల ఆందోళన


కాగజ్‌నగర్‌లో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కాగజ్‌నగర్, ఆగస్టు 20: రుణమాఫీ విషయంలో స్పష్టత కరువైందని మంగళవారం కాగజ్‌నగర్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా పార్టీ సిర్పూరు నియోజకవర్గ ఇన్‌చార్జి లెండుగురే శ్యాంరావు మాట్లాడారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఇచ్చిన పిలుపు మేరకు ధర్నా కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు. రైతు రుణమాఫీ విషయంలో ప్రభుత్వం మొసలి కన్నీరు కారుస్తున్నదని విమర్శించారు. రేషన్ కార్డు తప్పని సరిగా ఉండాలని ప్రభుత్వం కొర్రి విధించడం సరికాదన్నారు. బ్యాంకు లింకేజీ విషయంలో కూడా అంక్షలు పెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. అమలు కాని హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కిందన్నారు. ఇప్పుడు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా డొంకతిరుగుడు మాటలు చెబుతూ కాలం వెళ్లదీస్తున్నారని అన్నారు. ప్రజలు దీన్ని గమనిస్తున్నారని చెప్పారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆంక్షలు లేకుండా రైతు రుణమాఫీ, రైతు బంధు కూడా వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంబాల ఓదెలు, మోయిన్, ఆవుల రాజ్‌కుమార్, శ్రీనివాస్, పాకరాజు, కన్నయ్య, శ్రీని వాస్, అస్లం, లలిత, అనిత, చంద్రకళ, స్వప్న, రావూజీ, దేవాజీ పాల్గొన్నారు.

పెంచికలపేట: రైతులందరికీ రుణమాఫీ వర్తింజేయాలని బీఆర్ఎస్ నాయకులు మంగళ వారం తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల కన్వీనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకుడు ప్రవీణ్‌కుమార్ పిలుపు మేరకు తహసీల్దార్‌లకు వినతి పత్రాలు అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బెజ్జూరు: రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకులు తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జనార్దన్, ఖాజాసమియోద్దీన్, శంకర్, రాందాస్, రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు

చింతలమానేపల్లి, ఆగస్టు 20: రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏవో రామకృష్ణ అన్నారు. మండలంలోని బాలాజీఅనుకోడ రైతు వేదికలో మంగళవారం రైతులకు రుణ మాఫీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రభుత్వం ఎలాంటి సమస్య లేని కుటుంబానికి రూ. 2 లక్షల రుణ మాఫీ చేసిందన్నారు. రుణ మాఫీ విషయంలో ఎలాంటి సమస్యలు ఉన్నా బుధవారం నుంచి నెల రోజుల వరకు బాలాజీ అనుకోడ రైతు వేదికలో దరఖాస్తులు తీసుకుంటామని తెలిపారు.

విద్యార్థులకు బ్యాగ్‌లు పంపిణీ

పెంచికలపేట, ఆగస్టు 20: పెంచికలపేట మండలం కొండపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన నిషా జోహ్రి, జగేంద్ర కుమార్ జోహ్రి స్మారక న్యాస్ నిర్వాహకుడు అమిత్ జోహ్రి సౌజన్యంతో వలంటరీ గడ్డం మహేష్‌గౌడ్ ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ సంజీవ్‌తో కలిసి మంగళవారం విద్యార్థులకు నోట్ బుక్కులు, పెన్నులు, బ్యాగులు అందజేశారు. కార్యక్రమంలో వలంటీర్లు రాజాగౌడ్, రేణుక, ప్రధానోపాధ్యాయుడు అశోక్, ఉపాధ్యాయులు తిరుమల్‌గౌడ్, ప్రశాంత్ పాల్గొన్నారు. మండలంలోని చెడ్వాయి ప్రధానోపాధ్యాయుడు రమేశ్‌బాబు ఆధ్వర్యంలో 182 మంది విద్యార్థులకు వాటర్ బాటిళ్లను ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రాకేష్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు రమేష్, రాజవర్ధన్, రవి, ఉత్తం బిశ్వాస్, ఉపాధ్యాయులు సంతోష్, రాజకమలాకర్‌రెడ్డి, శిల్ప, ధృపద, వెంకటేష్, అబ్దుల్, తదితరులు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు

కాగజ్‌నగర్ టౌన్, ఆగస్టు 20: కాగజ్‌నగర్ శ్రీ రేణుకా మాత ఎల్లమ్మ ఆలయ ఆవరణలో మంగళవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న గౌడ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్ గౌడ్, ప్రకాష్ గౌడ్, జగ్గా గౌడ్, శ్రీనివాస్ గౌడ్, పోచాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తిర్యాణి: మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో మంగళవారం గౌడ సంగం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు శంకర్‌గౌడ్, అనిల్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, బి శంకర్‌గౌడ్, రంగాగౌడ్, అశోక్‌గౌడ్, వెంకటేశంగౌడ్, బుచ్చ గౌడ్, ఎస్ శ్రీనివాస్ గౌడ్, శంకర్ గౌడ్,బి. శంకర్‌గౌడ్, బుచ్చగౌడ్, మహేందర్‌గౌడ్, విక్రంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల నిరసన

- రూ.2 లక్షలకు మించి రుణం ఉన్న వారికి మాఫీ చేయాలని వినతి


: రైతుల వివరాలను పరిశీలిస్తున్న ఏవో మధులత

సిర్పూర్(టి), ఆగస్టు 20: ప్రభుత్వం రూ.2 లక్షలకు మించి తీసుకున్న రుణాల విషయంలో మాత్రం స్పష్టత ఇవ్వడంలేదని మంగళవారం రైతు వేదిక వద్ద రైతులు నిరసన తెలిపారు. రెండు లక్షలకు పైగా ఉన్న రైతుల రెండు లక్షల రుణాలు మాఫీ చేయాలని కోరారు. ఆ సమయంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న ఏవో మధులతకు విన్నవించుకున్నారు. తమకు రెండు లక్షల పైన ఉన్న వారికి రుణాలు మాఫీ కాలేదని ఆమె దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు అధైర్యపడోద్దని, ప్రభుత్వ నిబంధనల మేరకు రుణ మాఫీ వర్తిస్తుందన్నారు. ఈ విషయంలో బ్యాంకు మేనేజర్లను వివరణ కోరగా ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని తెలిపారు.

ప్రత్యేక అధికారుల నియామకం

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 20: పంట రుణమాఫీ ప్రక్రియలో భాగంగా రైతుల సమస్యలను పరిష్కరించేందుకు మండలానికి ఒక అధికారిని నియమిస్తూ జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా మండలాల రైతులు కేటాయించిన అధికారికి ఫిర్యాదులు అందజేయాలని సూచించారు. ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేటాయించిన ప్రదేశంలో అధికారి అందుబాటులో ఉంటారని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మండలాల వారీగా అధికారులు..

మండలం	అధికారి పేరు	హోదా	ప్రదేశం
ఆసిఫాబాద్	మిలింద్‌కుమార్	ఎంఏవో	ఏడీఏ కార్యాలయం
రెబ్బెన	రాకేష్	ఏఈవో	రైతు వేదిక
వాంకిడి	గోపికాంత్	ఎంఏవో	ఎంఏఓ కార్యాలయం
తిర్యాణి	వినోద్కుమార్	ఏఈవో	ఎంఏఓ కార్యాలయం
జైనూరు	సీతా రాజేందర్	ఏఈవో	ఎన్‌డీఏ కార్యాలయం
కెరమెరి	బి.వెంకటి	ఏడీఏ	ఎంఏఓ కార్యాలయం
సిర్పూర్(యూ)	ఆనంద్‌రావు	ఎంఏవో	రైతు వేదిక
లింగాపూర్	ఖలీల్	ఏఈవో	రైతు వేదిక
కాగజ్‌నగర్	రామకృష్ణ	ఎంఏవో	ఏడీఏ కార్యాలయం
సిర్పూర్(టి)	మధులత	ఎంఏవో	ఎంఏఓ కార్యాలయం
కౌటాల	ఘనశ్యాం	ఏఈవో	రైతు వేదిక
చింతలమానేపల్లి	శ్రీనివాస్	ఏవోఈ	రైతు వేదిక
దహెగాం	మనోహర్	ఏడీఏ	ఏడీఏ కార్యాలయం
పెంచికలపేట	శ్రీవిద్య	ఏఈవో	రైతు వేదిక
బెజ్జూరు	మారుతి	ఏఈవో	రైతు వేదిక

కాగజ్‌నగర్‌లో గాయత్రి యజ్ఞం

కాగజ్‌నగర్, ఆగస్టు 20: కాగజ్‌నగర్ బాలభారతి హైస్కూల్‌లో పతాంజలి యోగ శిబిరం ఆధ్వర్యంలో శ్రీ గాయత్రి యజ్ఞం యోగా గురువు ఆశోక్ ఆర్యా ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు.

నూతన చట్టాలపై అవగాహన

బెజ్జూరు, ఆగస్టు 20: మండల కేంద్రంలోని విద్యార్థులకు ఎస్సై విక్రం ఆధ్వర్యంలో కళాజాతా బృందంతో విద్యార్థులకు నూతన చట్టాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియమాలు, సైబర్ మోసాలు, షీ టీం సేవలు గంజాయి నివారణపై మంగళవారం అ వగాహన కల్పించారు. అలాగే సీసీ కెమెరాల ఆవశ్య కతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు పర్యవేక్షణలో కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ మధ్య కాలంలో సైబర్ నేరాలు విపరీతంగా పెరిగాయని, సైబర్ నేరగాళ్ల మాయ మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. ఎవరైనా మోసపోయినట్లయితే 1930కి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాంచందర్, రోహిత్, చంద్రశేఖర్, రజిత, సంఘవి, తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగుపై రైతులకు..

దహెగాం, ఆగస్టు 20: మండల కేంద్రంలోని రైతు వేదికలో వరి పంటలో చీడపీడల యజమాన్యం, అధిక వర్షాల తరువాత తీసుకోవల్సిన చర్యలపై శాస్త్రవేత్తలు శ్రవణ దృశ్య మాధ్యమం ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. రైతులు సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

నేడు సమీక్షా సమావేశం

దహెగాం, ఆగస్టు 20: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. వివిద శాఖల అధికారులు, గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారులు నివేదికలతో హాజరు కావాలని సూచించారు.

గంజాయి సాగు చేసిన వ్యక్తికి ఐదేళ్ల జైలు శిక్ష

ఆసిఫాబాద్, ఆగస్టు 20: గంజాయి సాగు చేసిన కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలుశిక్ష, రూ. లక్ష జరిమాన విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ మంగళవారం తీర్పుచెప్పారు. సీఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫాబాద్ మండలంలోని బాబాపూర్ గ్రామానికి చెందిన చునార్కర్ ముకుంద్‌రావు తన వ్యవసాయ చేనులో పత్తితో పాటు గంజాయి సాగు చేస్తున్నట్లు సమాచారం మేరకు అక్టోబరు 11, 2021న అప్పటి ఎస్సై గంగన్న తనిఖీ చేయగా 50 గంజాయి మొక్కలు లభ్యమయ్యాయి. దీంతో ముకుంద్‌రావుపై కేసు నమోదు చేసి చార్జీసీటు దాఖలు చేశారు. సాక్షులను కోర్టులో హాజరు పరుచగా పీపీ జగన్మోహన్‌రావు సాక్షులను విచారించగా నిందితుడిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి శిక్షతో పాటు రూ. లక్ష విధిస్తూ తీర్పు నిచ్చారు. నిందితునికి శిక్ష పడడంలో కృషి చేసిన డీఎస్పీ సదయ్య, సీఐ సతీష్, కోర్టు కానిస్టేబుల్ బాబురావు, లైజనింగ్ అధికారి నారయణలను ఎస్పీ శ్రీనివాస్‌రావు అభినందించారు.

ఐకేపీ వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

లింగాపూర్ 20: ఐకేపీ వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని సంఘం మండల అధ్య క్షుడు సలాం హనుమంతరావు కోరారు. మండల కేంద్రంలో మంగళవారం సంఘం సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వీవోఏలకు కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ఆధ్యక్షుడు రాజేందర్, పాండురంగ్‌చాటే, రవిందర్, బాలు, జ్యోతిరాం, భగవంతరావు, తిరుపతి, సోనుకుమార్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

దహెగాం, ఆగస్టు 20: దహెగాం మండలంలోని చౌక, ఒడ్డుగూడ గ్రామాల్లో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. జ్వర పీడుతులు 2 మంది రక్త నమునాలు సేకరించి జిల్లా ఆసుపత్రికి పంపినట్లు తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెకంన్న, ఏఎన్‌ఎంలు బేబి, లక్ష్మి, శాంత, సత్యవాణి, హెచ్ఏ ఓదేలు, తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లో అక్రమాలపై విచారణ జరిపించాలి


కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

రెబ్బెన, ఆగస్టు 20: రెబ్బెన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించాలని మంగళవారం కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు మాజీ జడ్పీటీసీ వేముర్ల సంతోష్, మాజీ సర్పంచ్ చెన్న సోమశేఖర్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ మాట్లాడుతూ చని పోయిన రైతుల పేరిట కూడా కొంత మంది అధికారులు రుణాన్ని కాజేసినట్టు తెలిపారు. బ్యాంకులో ఎలాంటి రుణం లేక పోయినా ఎరువుల కోసం పట్టాదారు పుస్తకం, ఆధార్‌కార్డు సహాయంతో రైతుకు తెలియకుండానే చాలా మంది రుణాలు తీసుకున్నట్టు తెలిపారు. రైతుల రుణం మొత్తం చెల్లించి నో డ్యూస్ సర్టిఫికెట్లు డబ్బులిచ్చిన కూడా ఇంత వరకు రెన్యూవల్ కాలేదని వివరించారు. త్వరలోనే సమగ్ర విచారణ జరిపితే మరిన్ని అక్రమాలు బయటపడుతాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మోడెం సుదర్శన్ గౌడ్, లెండుగురే గంటుమేర, సంజీవ్‌కుమార్ జైశ్వాల్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై విచారణ కాంగ్రెస్ నాయకుడు షబ్బీర్ హుస్సేన్, అన్‌ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా కన్వీనర్ పొన్న రమేశ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సర్వే నంబరు 147/2 మున్సిపాల్టీ కార్యాలయం సమీపంలో 1-16-552/4 /3/ఏ/1 ఇంటి నంబరును అక్రమంగా కేటాయించినట్లు చెప్పారు. ఈ స్థలంపై సమగ్ర విచారణ జరుపాలని కోరారు. 143 సర్వే నంబరులో ఉన్నఖాళీ స్థలాన్ని కూడా ఆక్రమించినట్టు వివరించారు. ఈ స్థలాలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కుమరం భీం
జిల్లా వార్తలు

8 బుధవారం 21 ఆగస్టు 2024

ఉపాధిహామీ పనుల పరిశీలన

జైనూర్, ఆగస్టు 20: మండలంలోని పవర్‌గూడ, జామ్ని, రాసిమెట్ట తదితర గ్రామాల్లో రిస్క్ బెస్ట్ ఇంటర్నల్ ఆడిట్ బృందం మంగళవారం ఉపాధి హామీ పనులను పరిశీలించింది. కార్యాలయంలోని పనుల రికార్డులు, ఎస్టిమేషన్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో రిస్క్ బెస్ట్ బృందం అధికారులు వెంకటేష్ జాదవ్, కె నర్సింహులు, ఏపీఓ నగేష్, ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఈసీ అంకుష్ టీఏలు రాజలింగు, గులాబ్‌సింగ్‌ల లింగేశ్వర్, ఆత్మారాం, రవిందర్, వెంకటేష్, పంచాయతీ కార్యదర్శులు భరత్, రవిందర్, ఉత్తం రవి, బాబు, మనోహర్, అంబాజీ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి



కాగజ్‌నగర్‌లో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూల మాలు వేస్తున్న రావి శ్రీనివాస్

కాగజ్‌నగర్, ఆగస్టు 20: కాగజ్‌నగర్ పట్టణంలో మంగళవారం మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సిర్పూరు నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజీవ్ గాంధీ ఆశయాలను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కొనసాగించాలని కోరారు., కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ వైస్ చైర్మన్ వార్ల తిరుపతి, సీనియర్ నాయకులు ఫైసల్‌బీన్ సులేమాన్, ఎమ్మాజీ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్: దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు శ్యాంనాయక్, నిజాం, జక్కన్న, శంకర్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

జైనూర్: మండల కేంద్రంలో రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయన చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అబ్దుల్ ముఖీద్, నాయకులు సుద్దాల శ్రీనివాస్, సుద్దాల ఆనంద్, ఇస్మాయిల్, ప్రభాకర్, కనక గంగారాం, పెందూర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి: దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు, కార్యక్రమంలో ప్రశాంత్, అనిల్, గణేశ్, దాదాజీ, పెంటు, సాయి, సోము, అరుణ్, రమేశ్, సోమ తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల గోస



ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పని చేసిన అతిథి అధ్యాపకులను ప్రభుత్వం రెన్యూవల్ చేయక పోవడంతో ఆందోళన చెందుతున్నారు. జూనియర్ కాలేజీల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రభుత్వం గతంలోనే నోటిఫికేషన్ జారీ చేసింది. రెండు నెలల క్రితం పరీక్ష నిర్వహించిన ప్రభుత్వం ఈ నెల ఐదు నుంచి సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేస్తుండడంతో తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

- 12 ఏళ్లుగా ప్రభుత్వ కళాశాలల్లో సేవలు
- ఎనిమిది నెలల వేతనంతో ఏడాది పాటు విధులు
- ఈ ఏడాది రెన్యూవల్‌కు స్పందించని సర్కార్
- జూలై 31తో ముగిసిన గడువు
- ప్రభుత్వం న్యాయం చేయాలని వినతి

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 20: ఇంటర్మీడియట్ విద్యావ్యవస్థలో ప్రభుత్వం గతంలో రెగ్యులర్ అధ్యాపక నియామకాలు నిలిపివేసి 2001లో కాంట్రాక్టు వ్యవస్థను తీసుకువచ్చింది. దీన్ని 2012లో నిలిపివేసి అతిథి అధ్యాపక వ్యవస్థను తీసుకు వచ్చింది. 2012 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ కళాశాలల్లో కాంట్రాక్టు సిబ్బందితో సమానంగా అతిథి అధ్యాపకులు పని చేస్తున్నారు. ప్రస్తుతం రెగ్యులర్ నియామకాలు జరుగుతుండడంతో వ్యవస్థ మసకబారే ప్రశ్నార్థకంగా మారింది. దీంతో అతిథి అధ్యాపకులు ఆవేదన చెందుతున్నారు.

జిల్లాలోని 11 కళాశాలల్లో..

జిల్లాలోని 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 61 మంది అతిథి ఆధ్యాపకులు పని చేస్తున్నారు. వీరికి గత జూలై 31 వరకు రెన్యూవల్ చేశారు. గత 20 రోజుల నుంచి తిరిగి రెన్యూవల్ ఆర్డర్ వస్తుందని ఎదురు చూస్తున్నప్పటికీ అధికారుల నుంచి స్పందన కరువైంది. దీంతో అధికారుల తీరును నిరసిస్తూ హైదరాబాద్ ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. అయినప్పటికీ ఇంకా రెన్యూవల్ రాకపోవడంతో ఎదురుచూడడం తప్ప చేసేదేమి లేకుండా పోయింది.

ఎన్నికల సందర్భంగా..

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా అతిథి అధ్యాపకుల సమస్యను మేనిఫెస్టోలో పొందుపరిచింది. ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు, 12 నెలల వేతనం ఇస్తూ ప్రస్తుత వేతనాన్ని రూ. 42 వేలకు పెంచుతామని తెలిపింది. రాష్ట్ర వ్యాప్తంగా 1,654 మంది అధ్యాపకులు ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని తమకు న్యాయం చేయాలని ముఖ్యమంత్రితో సహా అందరు మంత్రులను అధ్యాపకులు వేడుకున్నారు. ప్రభుత్వం కూడా మేనిఫెస్టో అమలు చేస్తామని చెబుతోంది. కాగా ఇప్పటి వరకు దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోక పోవడం గమనార్హం.

జేఎల్ నియామకాలతో..

గత ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్ పోస్టుల భర్తీ కోసం 1,364 పోస్టులతో నోటిఫికేషన్ జారీ చేసింది. రాష్ట్రంలో కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండు నెలల క్రితం పరీక్ష నిర్వ హించి ఫలితాలు ప్రకటించింది.దీంతో పాటు ఈనెల 5వ తేదీ నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ నిర్వహిస్తోంది. ఈ ప్రక్రియ సెప్టెంబరు ఐదు వర కు కొనసాగి 13న వారికి నియా మక ఉత్తర్వులు ఇవ్వనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. దీంతో గత 12 ఏళ్లుగా ప్రభుత్వ కళాశాలల బలోపేతం కోసం కృషి చేయడంతో పాటు 8 నెలల వేతనంతో 12 నెలలు పని చేసిన అతిథి అధ్యాపక వ్యవస్థ గందర గోళంలో పడింది.

ఉద్యోగ భద్రత కల్పించాలి..

శ్రీనివాస్, అతిథి అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షుడు



ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు 12ఏళ్లుగా మెరుగైన విద్య అందిస్తూ ఉత్తమ ఫలితాలు సాధించేందుకు పాటుపడ్డాం. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్ని కల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగ భద్రత కల్పించి రెన్యూవల్ చేయాలి. నూతన అధ్యాపకులు వస్తున్న నేపథ్యంలో మా ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వం మా పొట్ట కొట్టకుండా న్యాయం చేయాలి.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం : ఎస్పీ శ్రీనివాస్‌రావు

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 20: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సైబర్‌క్రైం విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గత ఏడాది 30 సైబర్‌క్రైంలు నమోదయితే ఈ ఏడాది ఇప్పటి వరకు 20 నమోదయ్యాయని చెప్పారు. నేరం జరిగినట్టు గుర్తిస్తే లేదా బాధితులు కనిపిస్తే వెంటనే 1930కు ఫోన్ చేయాలన్నారు. మోసపోయిన తర్వాత ఇబ్బంది పడేకంటే ముందు మోసపోకుండా చూసుకోవాలన్నారు. టీవీలోని ఒక వ్యాపార ప్రకటన ఉదాహరిస్తూ'డబ్బులు ఎవరికి ఊరికే రావని' దీనిని గుర్తుంచుకొని ఎటువంటి ఓటీపీలు కానీ ఇతరత్రా విషయాలు కొత్త వ్యక్తులకు చెప్పకూడదని తెలిపారు. ఏఎస్పీ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ జిల్లాలో ఏదైనా సైబర్‌క్రైమ్ నమోదైతే వెంటనే 1930కు లేదా సైబర్‌క్రైం డీఎస్పీ సెల్ నంబరు 8712665568కు సమాచారం అందించాలని సూచించారు. సైబర్‌క్రైం డీఎస్పీ రమేశ్‌బాబు మాట్లాడుతూ జార్ఖండ్ రాష్ట్రంలోని జాంతార అనే గ్రామంలో ప్రతి 10 మందికి 8 మంది సైబర్‌క్రైం చేస్తున్నట్టు గుర్తించామన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, నిర్మల్‌తో పాటు జగిత్యాల జిల్లా నుంచి పలువురిని ఉద్యోగాల పేరిట తీసుకువెళ్లి సైబర్ నేరాలు చేయిస్తున్నారని, అటువంటి వారిని విజయవాడ కమిషనర్ పట్టుకున్నట్లు తెలిపారు. డీఎస్పీ సదయ్య మాట్లాడుతూ గతంతో పోలిస్తే దొంగతనాల తీరు మారిందన్నారు. ఇళ్లల్లో దోపిడీలు తగ్గి సైబర్ నేరాలు పెరుగుతు న్నాయన్నారు. అనంతరం సైబర్ నేరాల నివారణకు పోలీసులు రూపొందించిన పోస్టర్ ఆవిష్కరించడంతో పాటు విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. అంతకు ముందు ప్రొజెక్టర్ ద్వారా సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐలు సతీష్, రమేశ్, చిట్టిబాబు, ఎస్సైలు రాజేశ్వర్, చంద్రశేఖర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాస్‌రావు

సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, ఆగస్టు 20: జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయం నుంచి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హైదరా బాద్ నుంచి పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భారీ వర్షాల సమయంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో చేప ట్టాల్సిన ప్రజా రక్షణ చర్యలపై అధికారులు ముంద స్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. వర్షాకాలం అయినందున సీజనల్ వ్యాధుల వ్యాప్తిని నియంత్రించేందుకు పాటించాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రమాద సమయంలో తక్షణ చర్యలు చేపట్టేందుకు రెస్క్యూ బృందాలతో సిద్ధంగా ఉండాలని సూచించారు భూ సమస్యల పరిష్కారం కోసం ధరణ పోర్టల్‌లో అందిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరిం చేందుకు కృషి చేయాలని తెలిపారు. నూతన ఆర్‌ఓఆర్ చట్టం ముసాయిదాపై పారదర్శకమైన అభిప్రాయ సేకరణ జరిగే విధంగా అధికారులు పర్యవేక్షించాలని చెప్పారు. కలెక్టర్ వెంకటేష్ దోత్రే మాట్లాడుతూ వచ్చే నాలుగు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జనజీవనానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. చెరువులు, కాలువలు దెబ్బతినకుండా జాగ్రత్తలు చేపడుతామన్నారు. రహదారులు, వంతెనలు, కాజ్‌వేలు, వాగుల వద్ద ప్రత్యేక బందో బస్తు చేపడుతామని తెలిపారు. విద్యుత్ స్తంభాలు, వ్యవసాయ ఉద్యానవన పంటలు దెబ్బ తినకుండా చర్యలు చేపడుతామని వివరించారు. శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ భవనాలు, నివాస గృహాలపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. వ్యాధుల వ్యాప్తిని నియంత్రించడంలో భాగంగా పారిశుధ్య కార్యక్రమాలు పకడ్బందీగా చేపడుతామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ దాసరి వేణు, ఆర్డీవోలు లోకేశ్వర్‌రావు, సురేష్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్లు భుజంగరావు, రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

- ఆదిమ గిరిజనుల అభివృద్ధికి చర్యలు

ఆసిఫాబాద్: దేశంలోని ఆదిమ గిరిజనుల అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ సంచాలకులు వైభవ్ గోయల్ అన్నారు. న్యూఢిల్లీ నుంచి మంగళవారం ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్‌లతో ప్రధానమంత్రి జన్‌మన్ పథకం నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని అన్నారు. ఈ క్రమంలో అర్హత కలిగిన ప్రతి గిరిజనులకు పథకం ఫలాలు అందే విధంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో గల ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ వెంకటేష్ దోత్రే, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి తుకారాం, జిల్లా గిరిజనాభివృద్ధి శాఖాధికారి రమాదేవిలతో కలిసి హాజరయ్యారు. ప్రధాన మంత్రిజన్‌మన్ పథకం కింద ఆదిమ గిరిజనుల(పీవీటీజీ)ల అభివృద్ధి కోసం అన్ని చర్యలు తీసుకుంటు న్నామని తెలిపారు. జిల్లాలో 3,615 గృహాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని, గిరిజన గ్రామాలకు జిల్లా కేంద్రానికి అనుసంధానం చేస్తూ రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకుం టున్నామని తెలిపారు. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు అందరం సమిష్టిగా కృషి చేద్దామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి తుకారాంతో కలిసి జిల్లాలోని ప్రైవేటు క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు, నర్సింగ్ హోం వైద్యులతో సీజనల్ వ్యాధుల నియంత్రణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులలో ముఖ్యంగా మలేరియా, డయేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, టైఫాయిడ్ వ్యాధులు ఎక్కువగా వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నందున అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలు, పట్టణ ప్రాంతాల్లో ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్స కోసం వచ్చే వ్యక్తులకు అవసరం మేరకు రక్త నమూనాలను పరీక్షించాన్నారు. వారిలో ఎవరికైనా పాజిటీవ్‌గా రిపోర్టు వచ్చినట్లయితే వారి వివరాలను ప్రతి రోజు సాయంత్రం 4 గంటలకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయానికి నిర్ణీత ప్రొఫార్మాలో పంపించాలని తెలిపారు. గ్రామాల్లో ప్రజల సౌకర్యార్థం వైద్య శిబిరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రైవేటు ఆసుపత్రులలో వైద్యులు, సిబ్బంది వివరాలు అందించాలని, ఆయా ఆసుపత్రులలో అందించే వైద్య సేవల ధరల పట్టికను ప్రదర్శించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి పర్యవేక్షకులు చెన్న కేశవ, డిప్యూటీ డీఎంహెచ్‌వో సీతారాం, ఐఎంఏ సభ్యులు, ప్రైవేటు వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తి సాధనకు కృషి చేయాలి

- కార్పొరేట్ జీఎం(ఐఅండ్‌పీఎం) రవికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

శ్రీరాంపూర్, ఆగస్టు 20: ఈ ఆర్థిక సంవత్సరంలో బొగ్గు ఉత్పత్తి సాధనకు కృషి చేయాలని కార్పొరేట్ జీఎం(ఐఅండ్‌పీఎం) ఎ రవికుమార్ అన్నారు. శ్రీరాంపూర్ ఏరియా ఇన్‌చార్జి మేనేజర్ టి శ్రీనివాస్‌తో కలిసి ఆయన సీసీసీలోని గెస్ట్‌హౌస్‌లో సమీక్షాసమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యేటా మాదిరిగానే బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి అనుగుణంగా పనిచేయాలన్నారు. ఉత్పత్తి చేసిన బొగ్గును సరైన సమ యంలో రవాణా చేయాలన్నారు. అందుకు అవసరమైన యంత్రాలు, యంత్ర సామ గ్రిని వినియోగించుకోవాలని చెప్పారు. అవసరమైన విషయంలో ఉన్నతాధికారులతో ఎప్పటికప్పుడు చర్చించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం ఎన్ సత్యనా రాయణ, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, ఇందారం ఓసీపీ పీవో ఏవీ రెడ్డి ఏజెంట్లు గోపాల్‌సింగ్, శ్రీధర్, డీజీఎంలు రవీందర్, ఆనంద్‌కుమార్, మల్లయ్య, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జీఎంను కలిసిన క్రీడాకారులు



జీఎంను సన్మానిస్తున్న క్రీడాకారులు

మందమర్రిటౌన్, ఆగస్టు 20: మందమర్రి ఏరియా నూతన జీఎంగా బాధ్యతలు స్వీకరించిన దేవేందర్‌ను మంగళవారం మందమర్రి ఏరియా డబ్ల్యూపీఎస్ జీఏ క్రీడాకారులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు మొక్కలను అందజేసి ఘనంగా శాలువాలతో సన్మానించారు. ఈ ఆర్థిక సంవత్సరం నిర్వహించనున్న క్రీడల గురించి స్పోర్ట్స్ సెక్రటరీ, పీఎం మాస్కుల కార్తీక్ వివరించారు. కార్యక్రమంలో పీఎం శ్యాంసుం దర్, గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, క్రీడాకారులు, కళాకారులు తోట చిన్నయ్య, రవికుమార్, రాజేశ్వర్‌రావు, సాదనవేని ప్రభాకర్, నస్పూరి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలకు సత్వర పరిష్కారం

శ్రీరాంపూర్, ఆగస్టు 20: కార్మికులు, ట్రేడ్స్‌మెన్ సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపాలని ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా అన్నారు. ఆర్కె-7 గనిని మంగళవారం వారు సందర్శించి ఉద్యోగుల సమస్యలు తెలుసుకున్నారు. ట్రిట్‌మెంట్స్ అండ్ ఫిట్ అయితే సూటబుల్ జాబ్ ఇవ్వాలని, క్యాడర్ స్కీమ్ పరిష్కారం చూపాలని ట్రేడ్స్‌మెన్, కార్మికులు కోరగా కృషి చేస్తామని నాయకులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, పిట్ కార్యదర్శి రవీందర్, సహాయ కార్యదర్శి ప్రతాప్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, సురేష్, తిరుపతి, పవన్, వంశీకృష్ణ, యాదగిరి, పాల్గొన్నారు.

ఏరియాకు తలమానికం కేకే-5 గని

మందమర్రి టౌన్, ఆగస్టు 20: మందమర్రి ఏరియాకు తలమానికం కేకే- 5 గని అని గని మేనేజర్ ప్రవీణ్‌కుమార్, బదిలీపై వెళ్తున్న మేనేజర్ ఎండి అల్లావోద్దీన్ తెలిపారు. మంగళవారం గనిపై నిర్వహించిన సమావేశంలో కార్మికులను ఉద్దేశించి వారు మాట్లాడారు. ఏరియాలోనే రెండు జాతీయ రక్షణ అవార్డులతో పాటు రీజియన్ స్థాయి వరకు సాధించిన గనిగా మంచి రికార్డులు ఉన్నాయని, ఈ రికార్డుల సాధన వెనుక ఉద్యోగులు, అధికారుల పని తీరు వల్లనే సాధ్యమైందన్నారు. కార్మికులు అధికారులతో మమేకమై పనిచేస్తున్నందువల్లే గని రికార్డుల పరంపర సాగిస్తుందని, ఉత్పత్తిలో ముందుండడం గొప్ప విషయమన్నారు. ఈ గనిలో కార్మికుల సహకారం మరువలేనిదని చెప్పారు. ఈ గని జీవిత కాలం మరో నాలుగు సంవత్సరాలు ఉన్నందున రక్షణతో కూడిన ఉత్పత్తి లక్ష్యం గా పని చేయాలన్నారు. విధిలో రక్షణ సూత్రాలను విస్మరించవద్దన్నారు. కాగా కేకే 5 గని మేనేజర్‌గా పని చేసి గోదావరిఖని ఆర్జీ 1కు పదోన్నతితో బదిలీపై వెళ్తున్న అల్లావోద్దీన్‌ను కార్మికులు, అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రక్షణాధికారి రవికుమార్, అసిస్టెంట్ మేనేజర్ జశ్వంత్, పిట్ ఇంజనీర్ నవీన్, సంక్షేమాధికారి కార్తిక్, గుర్తింపు సంఘం నాయకులు బీవనాయని సుదర్శన్, కంది శ్రీనివాస్, గాండ్ల సంపత్, సోముశెట్టి రాజశేఖర్‌లు పాల్గొన్నారు. ఐఎన్‌టీయూసీ నాయకులు రాంశెట్టి నరేందర్, మిట్ట సూర్యనారాయణ, సదయ్య, టీబీజీకేఎస్ నాయకులు మేడి పెల్లి సంపత్, జె రవిందర్, ఒ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఈపీఆర్‌లోని తప్పులను గనుల వద్దే సవరించాలి

శ్రీరాంపూర్, ఆగస్టు 20: ఈపీఆర్‌లోని తప్పులను గనుల వద్దే సవరించాలని హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి వి అనిల్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. సింగరేణి యాజమాన్యం గనులు, విభాగాల వద్ద ఈపీఆర్ ఆన్‌లైన్ చేయడంలో కొన్ని తప్పులు చోటు చేసుకున్నాయని తెలిపారు. డిపెండెంట్ల పేర్లు ఒకరికి బదులుగా, మరొకరివి వచ్చాయని పేర్కొన్నారు. తప్పులు సరి చేయాలని గనులు, విభాగాలపై అడిగితే జీఎం కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నా రన్నారు. విధులు పోగొట్టుకొని జీఎం కార్యాలయం చుట్టూ తిరిగే పరిస్థితి తలెత్తకుండా ఆయా గనులు, విభాగాల వద్దే సవరణలు చేపట్టాలని వారు కోరారు.

ఎస్ఆర్‌పీ-3 మేనేజర్‌కు సన్మానం

శ్రీరాంపూర్, ఆగస్టు 20: శ్రీరాంపూర్‌లోని ఎస్ఆర్‌పీ 3, 3ఏ గని మేనేజర్ వెంకట్‌రావును బీఎంఎస్ ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. ఆయన కేటీకే -1 నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. సన్మాన కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్ రెడ్డి, కేంద్ర కార్యదర్శి రాగం రాజేందర్, ఏరియా జాయింట్ కార్యదర్శి భూంపల్లి రమేశ్, పిట్ కార్యదర్శి కాంపెల్లి తిరుపతి, సహాయ కార్యదర్శి రాజేశ్, కిరణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లరికల్ సిబ్బందికి ఆన్‌డ్యూటీగా పరిగణించాలి

శ్రీరాంపూర్, ఆగస్టు 20: గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వర్తించిన సింగరేణి క్లరికల్ సిబ్బందికి ఆన్‌డ్యూటీగా పరిగణించాలని బీఎంఎస్ కేంద్ర ఉపాధ్యక్షుడు చాట్ల అశోక్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండు ఎన్నికల సందర్భంగా ఆయా రోజుల్లో ఉద్యోగులకు వేతనంతో కూడిన సెలవు ఇచ్చారని తెలిపారు. పనిచేసిన వారికి ప్లేడేలు ఇచ్చారని, కానీ ఎన్నికల విధుల్లో పాల్గొన్న వారికి మాత్రం స్పెషల్ లీవుగా పరిగణించారని పేర్కొన్నారు. దీనివల్ల ఎన్నికల విధులు నిర్వర్తించిన సదరు క్లరికల్ సిబ్బందికి నష్టం జరిగిందని తెలిపారు. యాజమాన్యంటీపీ, డీపీ ఇచ్చి చేతులు దులుపుకుందని, దీని వల్ల భవిష్యత్తులో మస్టర్లు, జీతం లీవులు, బోనస్ రావని తెలిపారు.

ఈపీ ఫిట్టర్లకు వెబ్ కౌన్సెలింగ్

శ్రీరాంపూర్, ఆగస్టు 20: శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాల్లో పనిచేస్తున్న ఈపీ ఫిట్టర్లకు మంగళవారం వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించారు. శ్రీరాంపూర్ వృత్తి శిక్షణ కేంద్రంలో 20 మంది ఉద్యోగులకు 19 మంది ఉద్యోగులు పాల్గొన్నారు. మెరిట్, స్పాస్ ఎంప్లాయిమెంట్ ప్రకారం పిట్టర్లకు పోస్టింగ్ అందించారు. కౌన్సెలింగ్‌ను ఎస్ఓటు జీఎం ఎన్ సత్యనారాయణ పర్యవేక్షించారు. కార్యక్రమంలో డీజీఎం(పర్సనల్) అరవిందరావు, డీజీఎం (ఐఈడీ) చిరంజీవులు, వీటీసీ మేనేజర్ వెంకటరామారావు, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలి

శ్రీరాంపూర్, ఆగస్టు 20: కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు జె శంకర్‌రావు అన్నారు. ఎస్ఆర్‌పీ 1 గనిలో మంగళవారం కార్మికులను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, క్యాంటీన్లలో పౌష్టికాహారం అందించాలన్నారు. కార్మికులు తమ వస్తువులు దాచుకునేందుకు పెట్టెలు అందుబాటులో ఉంచాలని కోరారు. కార్యక్రమంలో ఉప ప్రధాన కార్యదర్శి గరిగె స్వామి, తిరుపతి రాజు, నీలం సదయ్య, మహేందర్ రెడ్డి, తిరుపతి, రావుల అనిల్, మద్దెల వెంకటేష్, నారాయణ స్వామి, తిరుపతిరావు పాల్గొన్నారు.

● సంక్షిప్తం..

ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం

వాంకిడి, ఆగస్టు 20: వాంకిడి మండలం వెల్గి గిరిజన ఆశ్రమ పాఠశాలలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంవో ఉద్ధవ్, ఎంవో సుమంగలి, హెచ్ఈవో రవిదాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీ భవనం ప్రారంభించాలి

ఆసిఫాబాద్, ఆగస్టు 20: జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన కేజీబీవీ కళాశాల భవనాన్ని వెంటనే ప్రారంభించాలనిమంగళవారం కేవీపీఎస్ నాయకులు కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు దినకర్, డీవైఎఫ్ఐ నాయకులు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌వోఆర్ చట్టంపై ప్రజాభిప్రాయ సేకరణ

ఆసిఫాబాద్, ఆగస్టు 20: ప్రభుత్వం చేపట్టిన నూతన ఆర్‌వోఆర్ చట్టంపై ప్రజాభిప్రాయ సేకరణ ముసాయిదా బిల్లుపై ప్రజల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించనున్నామని జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. 23లోగా ఈ-మెయిల్, పోస్టు ద్వారా సీసీఎల్ఏ కార్యాలయంకు పంపించాలని కోరారు.

బంద్‌ను విజయవంతం చేయాలి

వాంకిడి, ఆగస్టు 20: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీరును వ్యతిరేకిస్తూ బుధవారం ఆల్ ఇండియా బహుజన సంఘాల ఆధ్వర్యంలో ఇచ్చిన భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని బీఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు అశోక్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రజలు, వ్యాపారులు సహకరించాలని కోరారు.

కౌటాల: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణను సమర్థిస్తూ క్రిమీలేయర్‌ను ప్రవేశ పెడుతూ ఇచ్చిన సుప్రీం కోర్టు తీర్పును నిరసిస్తూ బుధవారం తలపెట్టిన భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని మాల మహానాడు, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు కోరారు. ప్రజలు వ్యాపారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు అవగాహన

ఆసిఫాబాద్, ఆగస్టు 20: ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని సెయింట్ మేరీస్ హైస్కూల్‌లో విద్యార్థులకు జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు పర్యవేక్షణలో విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోక్సో చట్టం, శిక్షలు, బాల్య వివాహాల నిరోధక చట్టం గురించి అవగాహన కల్పించారు. ఆపదలో ఉన్న వారు 100కి కాల్ చేయాలని, భరోసా సెంటర్ టోల్ ఫ్రీ 8712670561, షీ టీం 8712670565 నెంబర్‌లకు ఫోన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై, షీ టీం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.